అకాల వర్షం


విల్లుపురంలో కురుస్తున్న వర్షం

చల్లబడిన వాతావరణం

- చెన్నైలో చిరుజల్లులు
- రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వారం రోజులుగా భగభగలాడిన సూరీడు బుధవారం కాస్త శాంతించాడు. బుధవారం వేకువజామున కొన్నిచోట్ల కురిసిన వర్షాలకు రాష్ట్ర ప్రజలు కాస్త చల్లబడ్డారు. చెన్నై, వేలూరు, తిరుపత్తూరు, తిరువణ్ణామలై, కడలూరు, విల్లుపురం, కళ్ళకురిచ్చి జిల్లాల్లో వేకువజామున సుమారు గంటసేపు వర్షం కురిసింది. విల్లుపురం జిల్లాలో వేకువజామున ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం 7 నుంచి ఎనిమిది గంటల వరకు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఆ జిల్లాలోని మేల్‌మలయనూరు, అవలూరుపేట, వలంది పరిసర ప్రాంతాల్లోనూ వేకువజామున వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఇదే విధంగా దిండివనం పరిసర ప్రాంతాల్లోను చల్లటి గాలులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దిండివనం, వెలిమేడుపేట, మేల్‌పాక్కం, సారం, ఓలక్కూరు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రజలు ఊరట చెందారు. కడలూరు జిల్లా కడలూరు, మంజకుప్పం, తిరుపాదిరిపులియూరు, మునగర్ కొండూరు, పాలూరు, తిరువత్తిపురం, నెల్లికుప్పం ప్రాంతాల్లో వేకువజామున వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. కళ్ళకురిచ్చి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ బుధవారం వేకువజాము వర్షం కురిసింది. కళ్ళకురిచ్చి, ఉలుందూరుపేట, కళమరుదూరు, తిరునావలూరు, సెంగురిచ్చి తదితర ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులతో ప్రారంభమైన ఈ వర్షం ఉధృతంగా మారింది. దీంతో రహదారుల్లో వర్షపునీరు పొంగి ప్రవహించింది. తిరుక్కోవిలూరు పరిసర ప్రాంతాల్లోనూ వేకువజాము 3.30 గంటల సమయంలో చెదురుమదురుగా వర్షం కురిసింది. ఈ వర్షానికి వారం రోజులుగా ఎండవేడికి బాధపడిన ప్రజలంతా ఊరట చెందారు.

చెన్నైలో కూడా...

చెన్నైలో వేకువజామున 4 గంటల ప్రాంతంలో హఠాత్తుగా ఉరుములతో ప్రారంభమైన వర్షం.. క్రమేణా ఊపందుకుంది. మైలాపూర్, సైదాపేట, గిండి, ఆలందూర్, మీనంబాక్కం, పెరంబూర్, అడయార్, పులియాంతోపు, వేళచ్చేరి, ఈక్కాడు తాంగల్, అశోక్‌నగర్, వడపళని, తాంబరం, క్రోంపేట, పెరంబూరు, ఎంకేబీ నగర్, కన్నదాసన్ నగర్ తదితర ప్రాంతాల్లో సుమారు పావుగంట సేపు చిరుజల్లులు కురిశాయి. బుధవారం ఎండవేడి లేకపోవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది.


'కళాశాల స్వప్నం-2024' పేరుతో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా

డిగ్రీలో చేరే విద్యార్థినులకు జూలై నుంచి ప్రతినెలా రూ.1000

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటన

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): పుదుమై పెణ్ పథకం కింద డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థినులకు జూలై నుంచి ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంక్ ఖాతాలో జమచేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ప్రకటించారు. రాష్ట్రంలో ఆరు నుంచి ప్లస్-2 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యాకోర్సుల్లో చేరే విద్యార్థినులకు అమలు చేస్తున్న పుదుమైపెణ్ పథకం సత్ఫలితాలనిందిస్తోందని, ప్రస్తుతం డిగ్రీ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య కూడా పెరుగుతోందని సీఎస్ పేర్కొన్నారు. కొట్టూరుపురంలోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం హాలులో బుధవారం ఉదయం ప్లస్-2 విద్యార్థుల 'కళాశాల స్వప్నం -2024' పేరుతో ప్రత్యేక కార్యక్రమం జరిగింది ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ కొనసాగుతుండటం వల్ల ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి మురుగానందం పాల్గొన్నారు. ముందుగా మురుగానందం మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం అల్పాహార పథకం అమలు చేస్తుండటం వల్ల బాలికలు ఉన్నత విద్యనభ్యసించే స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా మాట్లాడుతూ.. జాతీయ స్థాయితో పోల్చుకుంటే రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థినులు అధికమన్నారు. రాష్ట్రంలో ప్లస్-2 ఉత్తీర్ణులయ్యే విద్యార్థినులంతా నూటికి నూరు శాతం డిగ్రీ కోర్సులు చదివే పరిస్థితి రాబోతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంక్షేమ కార్యక్రమాల్లో విద్యార్థినులు పెద్ద సంఖ్యలోపాల్గొని లబ్ధి పొందాలని విజ్ఞప్తి చేశారు. ఇక పుదుమై పెణ్ పథకం కింద డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థినులకు జూలై నుంచి ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంక్ ఖాతాలలో జమచేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ 'కళాశాల స్వప్నం' కార్యక్రమాలు తిరుచ్చి, కోయంబత్తూరు, నాగపట్టినం, మదురై, తిరునల్వేలి, సేలం నగరాలలోనూ బుధవారం జరిగాయని చెప్పారు. ఇదే విధంగా గురువారం తిరువళ్లూరు, నీలగిరి, పెరంబలూరు, మైలాడుదురై, దిండుగల్, ధర్మపురి జిల్లాల్లోను, శుక్రవారం చెంగల్పట్టు, తిరుప్పూరు, అరియలూరు, కడలూరు, తేని, కన్నియాకుమారి, కృష్ణగిరి జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. ఈ నెల 11న కాంచీపురం, ఈరోడ్, తంజావూరు, విల్లుపురం, విరుదునగర్, తూత్తుకుడి, తిరుపత్తూరు జిల్లాల్లోను, 13న రాణిపేట, తెన్‌కాశి, నామక్కల్, కరూరు, తిరువారూరు, పుదుకోట, కళ్ళకురిచ్చి, శివగంగ, రామనాధపురం, తిరువణ్ణామలై, వేలూరు జిల్లాలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్ట్స్ కోర్సులకు భలే డిమాండ్

- పోటీ పడుతున్న విద్యార్థులు
- బీకామ్‌కు విపరీతమైన పోటీ



అడయార్, మే 8: ఈ ఏడాది రాష్ట్రంలో సాంకేతిక విద్యా కోర్సులతో పాటు ఆర్ట్స్ సబ్జెక్టులకు కూడా డిమాండ్ పెరిగింది. ఇటీవల వెల్లడైన ప్లస్ టూ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. అనేక మంది విద్యార్థులు ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆర్ట్స్ కాలేజీల్లో ఉండే ఇతర కోర్సుల కంటే బీకామ్‌లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ప్లస్‌టూ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులు ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ కాలేజీల్లో చేరేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే, ఎక్కువ మంది విద్యార్థులు బీకామ్‌లో చేరేందుకు ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ట్స్ , సైన్స్ కాలేజీల్లో లక్ష సీట్లున్నాయి. బీఏ తమిళం, ఇంగ్లీష్, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ వంటి అనేక కోర్సులున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో అతి తక్కువ ఫీజు చెల్లించి డిగ్రీ కోర్సులు అభ్యసించే అవకాశం ఉండటంతో అనేక మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు పోటీ పడుతున్నారు. చెన్నై నగరంలోని టాప్ కాలేజీల్లో సీటు సంపాదించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా లయోలా, డీజీ వైష్ణవ, యతిరాజ్, మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ, స్టెల్లా మెరీస్ వంటి ప్రధాన కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కటాఫ్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు. అలాగే, భారతీ ఉమెన్స్ కాలేజీ, రాణీమేరీ కాలేజీ, రాజధాని కాలేజీ వంటి కాలేజీల్లో సీటు కోసం ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో సీటు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 6న ప్లస్‌టూ ఫలితాలు విడుదల కాగా, కేవలం మూడు రోజుల్లోనే 50 వేల మంది విద్యార్థులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.



ప్రభుత్వ బస్సుల్లో యూపీఐ ద్వారా టికెట్

ప్యారీస్, మే 8: రాష్ట్రప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో యూపీఐ ద్వారా టికెట్ పొందే సదుపాయం కల్పించింది. ఫిబ్రవరిలో రాజధాని నగరం చెన్నైలో నడుపుతున్న ఎంటీసీ బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం యూపీఐ, జీ పే క్రెడిట్, డెబిట్, ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించి టికెట్లు పొందే విధానం అమలులోకి వచ్చింది. ఈ పథకానికి ప్రయాణికుల్లో విశేషస్పందన రావడంతో దూరప్రాంతాలకు నడుపుతున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అమలుచేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న 300 ఏసీ బస్సులు సహా 1,068 బస్సుల్లో ఈ కొత్త విధానం అమలుకు రావడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్ల పాలన సాధన కాదు వేదన...!

- డీఎంకేపై ఈపీఎస్ ధ్వజం

పెరంబూర్, మే 8: డీఎంకే మూడేళ్ల పాలన సాధన కాదని.. అది కేవలం వేదన మాత్రమేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. మాదకద్రవ్యాలను అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు విదేశాలకు తరలిస్తున్నారనే వార్తలు తమిళ ప్రజలు తలదించుకొనేలా ఉన్నాయన్నారు. డీఎంకే అధికారం చేపట్టిన వెంటనే, విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్ను, ఆస్తి పన్ను, వాటర్ టాక్స్, చెత్త పన్ను, పాల ధరలు పెంచారన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే పాలనలో చట్టాలు కఠినంగా అమలు చేయడంతో శాంతి భద్రతలు అదుపులో ఉండేవన్నారు. ప్రస్తుతం డీఎంకే పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలిపోతున్నారని ఆరోపించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులను అధికార పార్టీ నేతలు బెదిరించే ఘటనలు అధికమయ్యాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. అలాంటి పార్టీకి మరో రెండేళ్ల అవకాశం ఉండగా, ఆలోగా రాష్ట్రాభివృద్ధి పాతాళానికి వెళతోందని ప్రజలు భావిస్తున్నారని పళనిస్వామి తన ప్రకటనలో విమర్శించారు.



రేపే టెన్త్ ఫలితాలు

పెరంబూర్, మే 8: టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఈనెల 10వ తేది విడుదల కానున్నాయి. నుంగంబాక్కంలోని డీపీఐ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు ఈ ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలు www.tnresults.nic.in, www.dge.tn.gov.in, https://results.digilocker.gov.in/ అనే వెబ్‌సైట్లలో విడుదల చేయనున్నారు. విద్యార్థులు తమ రిజిస్టర్ నెంబరు, పుట్టిన తేది నమోదు చేసి ఫలితాలు తెలుసుకోవచ్చు. అలాగే, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోని జాతీయ సమాచార కేంద్రాల్లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు. అదే సమయంలో విద్యార్థుల సెల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో ఫలితాలు పంపుతామని పరీక్ష శాఖ తెలియజేసింది.

బీజేపీ మాజీ ఎమ్మెల్యే వేలాయుధన్ కన్నుమూత

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది జిల్లాల నుంచి మొట్టమొదటిసారిగా ఎన్నికైన బీజేపీ శాసనసభ్యుడు, వేలాయుధన్ (78) బుధవారం ఉదయం మృతిచెందారు. వేలాయుధన్ తన 13 యేట 1963లో ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 1982లో హిందూ మున్నాని నిర్వాహకుడిగా నియమితులయ్యారు. 1989లో 39వ యేట డిపాజిట్ సొమ్ము కోసం నానాతంటాలు పడి ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు నాలుగోస్థానమే లభించింది. 1991లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారు. మూడోసారి 1996లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కన్నియాకుమారి జిల్లా పద్మనాభపురం నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. దీంతో దక్షిణాది జిల్లాల నుంచి ఎన్నికైన మొదటి బీజేపీ ఎమ్మెల్యేగా ఆయన పేరు సంపాదించుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఈయన్ని ఉత్తమ శాసనసభ్యుడిగా ప్రశంసించి సత్కరించారు. ఆ తర్వాత 2001, 2006 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత కొంత కాలం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2006 తర్వాత క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులైన చిన్నారుల పాఠశాల కోసం నాగర్‌కోయిల్ జిల్లా కరువ్వకోట ప్రాంతంలో ఉన్న తన ఇంటిని దానంగా ఇచ్చారు. కొన్నేళ్ళ పాటు ఆ పాఠశాలలోనే ఉన్నారు. వేలాయుధన్ సతీమణి జగదాంబిక కొన్నేళ్ళ క్రితమే మృతి చెందారు. కుమార్తెలు నివేదిత, శివనందిని, కుమారుడు రామ్‌భగవత్ వివాహాలు చేశారు. ప్రస్తుతం తిరువనంతపురంలోని కుమారుడి ఇంటిలో నివసిస్తున్న వేలాయుధన్ కన్నియాకుమారి జిల్లా కరువ్వకోటలో ఓ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఉన్నట్టుంటి ఆయనకు గుండెపోటుకు గురై మృతి చెందారు. వేలాయుధన్ అంత్యక్రియలు కరువ్వకోటలోని ఆయన స్వగృహంలో గురువారం ఉదయం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.


వేలాయుధన్ (ఫైల్‌ఫొటో)

జయకుమార్ హత్య కేసులో మదురై ముఠా హస్తం ?

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సీనియర్ కాంగ్రెస్ నేత జయకుమార్ ధనసింగ్‌ను మదురైకి చెందిన కిరాయిముఠా హతమార్చినట్లు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దళం ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. ఆ ముఠాను రంగంలోకి దించిన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అదే సమయంలో జయకుమార్ భార్య, ఇద్దరు కుమారులు, బంధువులను కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఎస్పీ శిలంబరసన్ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు దళం మూడు జట్లుగా ఏర్పడి ఈ విచారణ చేస్తున్నారు. ఈ హత్యకేసుకు సంబంధించి ఓ వీడియో వెలువడింది. జయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్తుండగా ఆయన మెడ నుండి కాలి దాకా చుట్టి ఉన్న విద్యుత్ వైర్లు, వీపుపై కట్టి వున్న కడపరాయి ఆ వీడియోలో కనిపించాయి. అంతేకాకుండా జయకుమార్ మెడవద్ద విద్యుత్ తీగతో నులిమినట్లు గాయం కూడా ఉంది. దీంతో జయకుమార్‌ది ముమ్మాటికీ హత్యేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అదే సమయంలో జయకుమార్ శరీరం చుట్టూ వైర్లు చుట్టి ఉండడం బట్టి, ముందస్తు ప్రణాళిక ప్రకారం కిరాయి ముఠాయే ఈ హత్య చేసి ఉంటుందని భావిస్తున్నారు. జయకుమార్ అటు రాజకీయాల్లోనూ, ఇటు ప్రభుత్వ కాంట్రాక్టులు పొందుతూ వాణిజ్యవేత్తగా రాణించారు. లక్షలాది రూపాయలను ఆయన వడ్డీలకు ఇచ్చేవారని సన్నిహితులు చెబుతున్నారు. ఈ వ్యాపార లావాదేవీల్లో సమస్యల కారణంగానే ప్రత్యర్థులు ఆయన్ని హతమార్చి ఉంటారని కూడా అనుమానిస్తున్నారు.

రూ.50 కోట్ల రుణాలు...

ఈ కేసును దర్యాప్తు చేస్తునన పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ... జయకుమార్ రాసిన లేఖల్లో ఆయనకు రావాల్సిన రుణాల గురించిన ప్రస్తావనే అధికంగా ఉందని చెప్పారు. అదే సమయంలో ఆయన వివిధ నగరాల్లో పలువురు వడ్డీవ్యాపారుల వద్ద తీసుకున్న కోట్లాది రూపాయల రుణాల గురించిన వివరాలు లేవన్నారు. తమకు అందిన సమాచారం బట్టి మదురై, రామనాధపురం, విరుదునగర్, తూత్తుకుడి జిల్లాల్లో వడ్డీవ్యాపారుల నుంచి సుమారు రూ.50 కోట్ల మేర రుణాలు తీసుకున్నారని చెప్పారు. ఈ రుణాలను ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టారని, అయితే సకాలంలో రుణాలను, వడ్డీ చెల్లించలేకపోయారని కూడా తమ దర్యాప్తులో తెలిసిందన్నారు. ఆర్థికలావాదేవీల విషయమై ఏర్పడిన తగాదాల్లో భాగంగా ఈ హత్య జరిగి ఉంటుందని, ప్రత్యర్థులు మదురైకి చెందిన కిరాయి ముఠా ద్వారా హత్య చేసి ఉంటారని ఆయన పేర్కొన్నారు. జయకుమార్ ఆత్మహత్య చేసుకునే ఆస్కారమే లేదని, వంటికి నిప్పంటించుకుని ఉంటే ఆయన పాదాలు కాలి ఉండవని చెప్పారు. అంతేకాక ఆయన శ్వాసకోశాల్లో పొగ వెళ్లిన దాఖలా లేదని పోస్టుమార్టం నివేదిక చెబుతోందన్నారు. ప్రస్తుతం మాయమైన జయకుమార్ సెల్‌ఫోన్‌లో ఆయన ఎవరెవరితో మాట్లాడారానే విషయాలను సెల్‌ఫోన్ సంస్థల నుంచి సేకరిస్తున్నామని, వాటి ద్వారా మరిన్ని విషయాలు బయటపడతాయని, హంతకులు త్వరలో అరెస్టవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


జయకుమార్ ధనసింగ్ (ఫైల్ ఫొటో)

సమాచార దర్శిని

ఫిషరీస్ వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

ఐసిఎఫ్, మే 8: ఫిషరీస్ విశ్వవిద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తమిళనాడు జె.జయలలిత ఫిషరీస్ వర్సిటీ ఆధ్వర్యంలో 11 అనుబంధ కళాశాలలున్నాయి. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. జూన్ 6వ తేదిలోపు https://tnagfi.ucanapply.com అనే వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 04365-256430, 9442601908 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

12న తెలుగు బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

ప్యారీస్, మే 8: నగరంలోని తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర వేడుకలు, త్యాగరాజ దినోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నారు. టి.నగర్‌లోని రామకృష్ణా మిషన్ మెట్రిక్ పాఠశాల ప్రాంగణంలోని ఇన్ఫోసిస్ హాలులో వచ్చే ఆదివారం సాయంత్రం 4.25 గంటలకు టీబీఎం అధ్యక్షుడు పీఎల్ఎన్ రఘుకుమార్ అధ్యక్షతన గణపతి పూజ, పంచాంగ పఠనంతో ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యఅతిథిగా డా.ఎం.శివకుమరన్ పాల్గొని ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తారని టీబీఎం ఉపాధ్యక్షుడు గోటేటి వెంకటేశ్వరరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి లక్షార్చన, తిరుమంజనం

ఐసిఎఫ్, మే 8: స్థానిక ట్రిప్లికేన్ అహోబిల మఠంలో లక్ష్మీనరసింహ పెరుమాళ్‌కు ఈ నెల 10 నుంచి 22వ తేది వరకు లక్షార్చన, తిరుమంజనం జరుగనున్నాయి. పార్థసారథి ఆలయ రథ వీధిలో అహోబిలం మఠం శాఖ ఉంది. ఇక్కడ ప్రతి ఏటా వివిధ ఉత్సవాలు, ప్రపంచ శాంతి కోసం యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, నరసింహ జయంతి, ప్రపంచ శాంతి కోసం లక్ష్మీనరసింహ పెరుమాళ్‌కు 10వ తేది నుంచి 22వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు తిరుమంజనం, రాత్రి 7 గంటలకు లక్షార్చన నిర్వహించనున్నారు.

నేడు ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

ఐసిఎఫ్, మే 8: ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాలు గురువారం జరుగనున్నాయి. స్థానిక చేపాక్కం క్రికెట్ మైదానంలో ఈ నెల 12వ తేది ఐపీఎల్ క్రికెట్ పోటీ జరుగనుంది.టిక్కెట్లవిక్రయాలు గురువారం ఉదయం 10.40 గంటల నుంచి పేటీఎం, వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.టిక్కెట్లుధరలురూ.1,700,రూ.2,500,రూ.3,500, రూ.4,000, రూ.6,000లుగా నిర్ణయించారు.

డాక్యుమెంటేషన్ ఫీజు పెంపు

ఐసిఎఫ్, మే 8: ఆస్తుల విక్రయాల్లో పబ్లిక్ అథారిటీ డాక్యుమెంటేషన్ ఫీజు పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ప్రకటన విడుదల చేసింది. గృహాలు, ఇళ్ల స్థలాలు, సంస్థల రిజిస్ట్రేషన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజుల్లో మార్పులు జరిగాయి. ఆ ప్రకారం, దత్తత పత్రాల ఫీజు రూ.100 నుంచి రూ.1,000, ప్రమాణ పత్రాల రిజిస్ట్రేషన్ ఫీజు రూ.20 నుంచి రూ.2,000, ఒప్పంద రిజిస్ట్రేషన్ ఫీజు రూ.20, నుంచి రూ.2,000, సంస్థల రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 ఉంది. ప్రస్తుతం రూ.10 లక్షలకు రూ.500 చొప్పున పెంచారు. దస్తావేజుల రద్దు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 నుంచి రూ.1,000కి పెరిగింది. వీటితో పాటు కుటుంబసభ్యుల రిజిస్ట్రేషన్ ఫీజు కూడా పెరిగాయని రిజిస్ట్రేషన్ శాఖ అధ్యక్షుడు దినేష్‌పొన్‌రాజ్ ఆలీవర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎగుమతుల్లో రాష్ట్రానికి మొదటిస్థానం

ఐసిఎఫ్, మే 8: వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, తోలు వస్తువుల ఎగుమతుల్లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. ఈ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ పరిశీలించి, 80 నుంచి 100 శాతం ఎగుమతులు చేసిన రాష్ట్రాలకు ర్యాంకులు ప్రకటిస్తోంది. దేశవ్యాప్తంగా జరిగిన ఎగుమతుల్లో తమిళనాడు 16.30 శాతం వస్తువులను ఎగుమతి చేసి రెండో స్థానంలో ఉంది. గర్భిణుల ఆరోగ్య భద్రతా విషయాల్లో కుటుంబ నియంత్రణలో మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రస్థాయిలో 50 ప్రత్యేక ఆర్థిక మండలాల్లో ఏర్పాటుచేసి జాతీయస్థాయిలో మొదటి స్థానంలో ఉంది. అలాగే, జౌళి, లెదర్ గూడ్స్ ఎగుమతుల్లో మొదటి స్థానంలో ఉంది.

సర్కారీ కొలువు కోసం 53.74 లక్షల మంది ఎదురుచూపులు

అడయార్, మే 8: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం 53.74 లక్షల మంది ఉపాధి కల్పనా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇదే విషయంపై స్టేట్ ఎంప్లాయిమెంట్ బోర్డు ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాల్లో ఏప్రిల్ నెల 30వ తేదీ వరకు 53.74 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 24,74,985 మంది, మహిళలు 28,98,847, హిజ్రాలు 284 మంది ఉన్నారు. అలాగే, దివ్యాంగుల సంఖ్య 1.49 లక్షలుంది. వీరిలో 18 యేళ్ళలోపువారు 10,69,000, 19 నుంచి 30 యేళ్ళ మధ్య వున్నవారు 23,62,000 మంది ఉన్నట్టు ఆ ప్రకటనలో పేర్కొంది.

తిరువనంతపురం వెళ్ళే రెండు విమానాల రద్దు

అడయార్, మే 8: చెన్నై నుంచి తిరువనంతపురం వెళ్ళే రెండు విమానాలను అర్థాంతరంగా రద్దు చేశారు. దీంతో ఆ విమానాల్లో ప్రయాణించాల్సిన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది మంగళవారం రాత్రి హఠాత్తుగా ఆందోళనకు దిగారు. దీంతో మంగళవారం రాత్రి 10.40 గంటలకు తిరువనంతపురంలో బయలుదేరి రాత్రి 11.50 గంటలకు చెన్నై చేరుకోవాల్సిన విమానాన్ని రద్దు చేశారు. అలాగే, చెన్నై నుంచి అర్థరాత్రి 12.30 గంటలకు తిరువనంతపురానికి వెళ్ళాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

వ్యవసాయ కనెక్షన్లకు ఏడాదికి రూ.7,000 కోట్ల రాయితీ

పెరంబూర్, మే 8: రాష్ట్రంలోని 26 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఏడాదికి రూ.7,000 కోట్ల రాయితీ అందజేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటన విడుదల చేసింది. వ్యవసాయానికి ప్రతిరోజు 700 మెగావాట్ల విద్యుత్ అందజేస్తున్నట్లు, ప్రస్తుతం రోజుకు 16 గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇస్తున్నట్లు తెలిసింది. మూడేళ్లలో కొత్తగా 1.5 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందజేసినట్లు ప్రభుత్వం తెలియజేసింది.

ప్లస్ టూ విద్యార్థులకు సలహాలు

పెరంబూర్, మే 8: ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించింది. ఉన్నత విద్యకు ఏ కళాశాలలో చేరాలి, దరఖాస్తు ఎలా చేసుకోవాలి, ఉపకారవేతనం పొందడం తదితరాలు తెలుసుకొనేలా పాఠశాల విద్యాశాఖ ఈకేంద్రం ప్రారంభించింది. విద్యార్థులు 14417 అనే టోల్ ఫ్రీ నెంబరును ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

బుద్ధపూర్ణిమను సెలవుదినంగా ప్రకటించాలి

దమ్మ సేన విజ్ఞప్తి

ప్యారీస్, మే 8: బుద్ధపూర్ణిమను సెలవుదినంగా ప్రకటించాలని అఖిల భారత దమ్మసేల విజ్ఞప్తి చేసింది. స్థానిక హార్బర్‌లోని కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం దమ్మసేన ఆధ్వర్యంలో పలు డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టారు. క్రిస్టియన్లు, ముస్లింలు, జైనులు, సిక్కులు తదితర మతాలకు చెందిన వారికి కల్పిస్తున్న హక్కులను బౌద్ధమతం స్వీకరించిన వారికి కూడా వర్తింపజేయాలని ధర్నాకు అధ్యక్షత వహించిన రాహుల్ ఆనంద్ ప్రభుత్వానికి విన్నవించారు. బౌద్ధమతం స్వీకరించిన వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం జీవోలో నోటిఫికేషన్‌గా విడుదల చేయాలని బుద్ధుడి బోధనలను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ఆయన జీవిత చరిత్రలోని ప్రధాన అంశాలను ప్రభుత్వ పాఠ్యాంశంలో చేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్ అన్బుదాసన్, వివిధ దళిత సంఘాలకు చెందిన లెమూరియర్, దేవేంద్రన్, కళామణి తదితరులు పాల్గొన్నారు.



హార్బర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దమ్మసేన నిర్వాహకులు

టీచర్లకు నిర్బంధ బదిలీలు

ఐసిఎఫ్, మే 8: ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో పనిచేసే అదనపు ఉపాధ్యాయులకు వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించడానికి ముందే నిర్బంధ బదిలీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తిని బట్టి ఉపాధ్యాయులను నియమించాలనే నిబంధనలున్నాయి. ఆ ప్రకారం, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఇదివరకే నియమితులైన ఉపాధ్యాయుల్లో అదనంగా ఉన్న వారిని వచ్చే విద్యా సంవత్సరం ఇతర పాఠశాలలకు తప్పనిసరిగా బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

స్పీడ్ బ్రేకర్ల సమీపంలో విద్యుత్ స్తంభాలొద్దు

ఐసిఎఫ్, మే 8: రాబోయే రోజుల్లో రోడ్డు పక్కన వేసే స్తంభాలను స్పీడ్ బ్రేకర్లు దగ్గర్లో కాకుండా కాస్త దూరంలో సురక్షిత విధానంలో ఏర్పాటుచేయాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ధ్వంసమైన స్తంభాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించింది. రోడ్డు పక్కన ఏర్పాటుచేసే స్తంభాలు ఊడిపోయి వాహనాలపై పడిపోకుండా ఉండేలా దూరాన్ని పాటించి ఏర్పాటుచేయాలని పేర్కొంది.

లైసెన్స్ ఉంటేనే పార్కులో శునకాలకు అనుమతి

ఐసిఎఫ్, మే 8: లైసెన్స్ ఉన్న శునకాలను మాత్రమే పార్కుల్లోకి అనుమతించాలని చెన్నై కార్పొరేషన్ ఉత్తర్వులు జారీచేసింది. పెంపుడు జంతువులతో పార్కుకు వెళ్లేటప్పుడు ఒక శునకాన్ని మాత్రమే వెంట తీసుకెళ్లాలని, తప్పనిసరిగా దాని మెడలో లైసెన్స్ బిళ్ల ఉంచాలని సూచించింది. పార్క్ సిబ్బంది లైసెన్స్ బిళ్ల పరిశీలించిన అనంతరమే శునకాలను పార్క్‌లోని అనుమతించాలని ఉత్తర్వులు జారీచేసింది.

సోలార్ విద్యుత్ కొనుగోలుకు అనుమతి

ఐసిఎఫ్, మే 8: సోలార్ విద్యుత్ 500 మెగావాట్ల కొనుగోలుకు విద్యుత్ బోర్డులకు కేంద్ర విద్యుత్ శాఖ అనుమతించింది. కేంద్ర ప్రభుత్వ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి 500 మెగావాట్లు సోలార్ విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్‌కు విద్యుత్ బోర్డు అనుమతి కోరింది. విజ్ఞప్తి పరిశీలించిన కమిషన్, 25 ఏళ్లకు ఒక యూనిట్ రూ.2.72 చొప్పున 200 మెగావాట్లు, యూనిట్ రూ.2.73 చొప్పున 300 మెగావాట్లకు కొనుగోలుకు అనుమతించింది.

పదోన్నతి తర్వాతే టీచర్లను బదిలీ చేయాలి

● పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, మే 8: పదోన్నతి కల్పించిన తర్వాతే టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పీఎంకే వ్యవస్థాపకులు డా.రాందాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, పీజీ, పీఈటీ, సాంకేతిక విద్య శాఖల్లో పనిచేస్తున్న టీచర్లకు పదోన్నతి కల్పించకుండా ఈ నెల 24వ నుంచి బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభించి జూన్ 30వ తేది వరకు జరుగుతుందని ప్రకటన విడుదలైందని తెలిపారు. అయితే 2021లో అధికారం చేపట్టిన డీఎంకే ప్రభుత్వం సీనియారిటీని బట్టి టీచర్లకు పదోన్నతి కల్పించలేదని, ఈ విధానం సరికాదని రాందాస్ తెలిపారు.

60 చెరువులకు మహర్దశ

ప్యారీస్, మే 8: రాజధాని నగరం చెన్నై పరిసర ప్రాంతాల్లోని 60 పెద్ద చెరువుల్లో పూడికతీయించి లోతు పెంచే విషయమై పరిశీలిస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షాలకు నగరంలో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా, వరదలను అడ్డుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వరదల సమయంలో నీరు నిలిచిన ప్రాంతాల వివరాలను భూ సర్వే నెంబరుతో విడు దల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలంలో వరదలు రాకుండా, వేసవిలో ప్రజలకు అవసరమైన నీటిని నిల్వచేయడం, నదుల కాలువలు, రిజర్వాయర్లు, పెద్ద చెరువుల్లో పూడికతీయించి లోతు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2015, 2021, 2023వ సంవత్సరాల్లో వరదల కారణంగా రాజధాని వాసులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో వందల సంఖ్యలో ఉన్న చిన్న, పెద్ద చెరువులు మినహా చెంబరంబాక్కం చెరువు, కుశస్థలి సహా 60 పెద్ద చెరువుల్లో పూడిక తీయించాలని గత నెల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా నేతృత్వంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ప్రజాపనుల శాఖ, సీఎండీఏ, రెవెన్యూ, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాల్లోని జలవనరుల విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీఎం ఆరోగ్య బీమా కింద రోగికి ఖరీదైన పేస్‌మేకర్

అడయార్, మే 8: అధిక హృదయ స్పందన రేటు (నిమిషానికి 200 కంటే ఎక్కువ)తో బాధపడుతూ మందులకు కూడా ప్రతిస్పందించని రోగి ప్రాణాలను నగరానికి చెందిన శ్రీరామచంద్ర హాస్పిటల్ వైద్యులు రక్షించారు. ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం కింద ఆ రోగికి వైద్యం చేశారు. ఈ పథకం అత్యంత ఖరీదైన పేస్‌మేకర్‌ను రోగికి అమర్చడంతో ప్రాణాలు రక్షించారు. ఈ రోగిలో కుడివైపు ఏఆర్‌వీసీ అనే సమస్య ఉన్నట్టు గుర్తించిన వైద్యులు... అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక మేకర్ పరికరం అమర్చడం ద్వారానే రోగి ప్రాణాలను రక్షించగలమని వైద్యులు గుర్తించారు. అయితే, ఈ పరికరం ధర భారీ ఖర్చుతో కూడుకున్నది కావడంతో సీఎం హెల్త్ స్కీమ్ కింద ఇంప్లాంటబుల్ కార్డియాక్ డిఫిబ్రిలేటర్ అని పిలిచే పరికరాన్ని సమకూర్చి రోగికి అమర్చినట్టు ఎస్ఆర్ఎంసీ కార్డియాక్ కేర్ సెంటర్ ఛైర్మన్, డైరెక్టర్ డాక్టర్ ఎస్.తణికాచలం వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఆర్ఎంసీ కార్డియాలజిస్టులు డాక్టర్ వినోద్ కుమార్; డాక్టర్ ప్రీతం కృష్ణమూర్తి, ఇతర వైద్య బృందం పాలుపంచుకుంది.

హైకోర్టు వద్ద మారణాయుధాలతో సంచారం

● ఆరుగురు యువకుల అరెస్టు

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు సమీపంలో మారణాయుధాలతో సంచరించిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఓ కేసు విచారణకు హాజరుకానున్న వ్యక్తిని హైకోర్టు ప్రాంగణం వద్దే హతమార్చేందుకు వీరు పథకం వేసుకున్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బుధవారం ఉదయం హైకోర్టు సమీపంలోని రాజా అన్నామలై మండ్రం వద్ద మూడు బైకుల వద్ద ఆరుగురు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ప్లనేడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని యువకులను చుట్టుముట్టారు. వారి బైకులను తనిఖీ చేయగా వేటకొడవళ్ళు, కత్తులు లభించాయి. వెంటనే ఆ మారణాయుధాలను స్వాధీనం చేసుకుని ఒట్టేరి ప్రాంతానికి చెందిన యశ్వంతరాయన్ సహా ఆరుగురిని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో ఆ ఆరుగురు మాదక ద్రవ్యాల కేసులో నిందితుడిగా ఉన్న అయనవరానికి చెందిన శరణ్ అనే యువకుడిని హత్యచేయడానికే వచ్చినట్లు తెలుసుకున్నారు. ఆ ఆరుగురిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.



వేలూరు జిల్లాలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మిని కలుసుకున్న సందర్భంగా వారిని కలెక్టర్ సత్కరించారు. (చిత్రంలో) జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి

జూన్ 24 నుంచి ప్లస్ టూ ఇన్‌స్టంట్ పరీక్షలు

పెరంబూర్, మే 8: ప్లస్ టూ ఇన్‌స్టంట్ పరీక్షలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 16వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టర్ ఎస్.సేతురామవర్మ విడుదల చేసిన ప్రకటనలో... ప్లస్ టూ ఇన్‌స్టెంట్ పరీక్షలు జూన్ 24 నుంచి జూలై 1వ తేది వరకు జరుగుతాయన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో ఫెయిలైన వారు ఈ నెల 16 నుంచి జూలై 1వ తేదిలోపు తాము చదివిన పాఠశాలల్లోను, ప్రైవేటు అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, ప్రభుత్వ సేవా కేంద్రాల ద్వారా పరీక్షా ఫీజు చెల్లించి దరఖాస్తు సమర్పించాలి. అలాగే, ఈ గడువులోగా దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు జూలై 3,4 తేదీల్లో తత్కాల్ విధానంలో అదనంగా రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమర్పించిన సమయంలో ఇచ్చే రసీదును అభ్యర్థులు భద్రపరచుకోవాలి. ఈ రసీదులో తెలియజేసిన నెంబరు వినియోగించి అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

జూలై 2 నుంచి ప్లస్ వన్...

ప్లస్ వన్ ఇన్‌స్టంట్ పరీక్షలు జూలై 2 నుంచి 9వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలు దరఖాస్తు స్వీకరణ తేదీ త్వరలో వెల్లడిస్తామని పరీక్ష శాఖ తెలియజేసింది.

గ్యాస్ సిలిండర్లకు బయోమెట్రిక్ విధానం

ప్యారీస్, మే 8: రాష్ట్రంలో రేషన్ దుకాణాల్లో అమలవుతున్న బయోమెట్రిక్ విధానంతో గ్యాస్ సిలిండర్ పొందే పథకం త్వరలో అమలులోకి వస్తుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్లను వినియోగించే వినియోగదారుల సంఖ్య 14.45 కోట్లకు పెరిగింది. ఇందులో ప్రస్తుతం 10.55 కోట్ల మంది వినియోగదారులు సబ్సిడీ పథకంలో చేరారు. తమిళనాడులో మొత్తం 1.51 కోట్ల మంది గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు పొంది ఉన్నారు. ఇందులో 1.6 కోట్ల మంది సబ్సిడీ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, గ్యాస్ వినియోగదారులకు ఐఓసీ, హెచ్‌పీ తదితర చమురు సంస్థలు కొత్త నిబంధనలు విధించాయి. ఆ రీతిలో ఇక నుంచి గ్యాస్ సిలిండర్ పొందాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి. ఈ విధానం ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో విజయవంతంగా అమలు జరుగుతోంది. అందువల్ల ఈ నెల చివరి వారంలో గ్యాస్ సిలిండర్ పొందేందుకు బయోమెట్రిక్ విధానం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేలిముద్రలు పడకపోయినా సిలిండర్

ఐసిఎఫ్, మే 8: వేలిముద్రలు పడకపోయినా వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని ఇండియన్ ఆయిల్ సంస్థ తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నారు. రాష్ట్రంలో 41 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు సహా మొత్తం 2.3 కోట్ల మంది వినియోగదారులున్నారు. ప్రస్తుతం వినియోగదారుల వేలిముద్రల నమోదు ప్రక్రియ జరుగుతోంది. కొన్ని చోట్ల వేలిముద్రలు నమోదుకాకపోవడంతో సిలిండర్లు ఇవ్వడం లేదు. దీనిపై ఇండియన్ ఆయిల్ సంస్థకు ఫిర్యాదులందడంతో స్పందించిన అధికారులు, వివరాలు పరిశీలించి వేలిముద్రలు నమోదుకాకపోయినా సిలిండర్ ఇవ్వాలని ఏజెన్సీలను ఆదేశించింది.

నేరాల అదుపునకు చర్యలు

వేలూరు, మే 8: జిల్లాలో నేరాల అదుపునకు చర్యలు చేపట్టాలని ఎస్పీ మణివన్నన్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మాసాంతపు సమీక్షా సమావేశంలో పోలీసు, జైళ్ల, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. నెలరోజుల్లో జిల్లాలో సంభవించిన నేరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ, నేరస్తులు, రౌడీల ఆగడాలు అడ్డుకొనేలా చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ మణివన్నన్

నీట్ రద్దు చేయాల్సిందే

● కార్తీ చిదంబరం

అడయార్, మే 8: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాల్సిందేనని కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం డిమాండ్ చేశారు. అలాగే, మెకెదాటు ఆనకట్ట నిర్మాణం అంశంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి తమ పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. ఆయన పళనిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ, నీట్ పరీక్షా సమయంలో విద్యార్థులను తనిఖీల పేరుతో అందవిహీనంగా తయారు చేయడం, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించకపోవడం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పరీక్షనే ప్రామాణికంగా ఉండరాదనేటి వంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు. అందుకే నీట్ రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

అకాలవర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, మే 8: అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు సత్వరం పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో... సాగునీరు లేక పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఎంతో కష్టాలకు ఓర్చి రక్షించుకున్న పంట అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని తగిన పరిహారం అందజేసి ఆదుకోవాలని ప్రేమలత డిమాండ్ చేశారు.

తిరుత్తణి ఆలయానికి వెళ్లిన భక్తుడి మృతి

పెరంబూర్, మే 8: తిరుత్తణి కొండ ఆలయానికి వెళ్లిన భక్తుడు ఊపిరాడక మృతి చెందిన ఘటన విషాదం నింపింది. తిరుత్తణి మురుగన్ ఆలయానికి ప్రతిరోజు వందలాది మంది భక్తులు వెళుతుంటారు. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులు జాగ్రత్తలు పాటించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, చోళవందాన్‌కు చెందిన ముత్తు బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో ఆలయానికి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతున్న సమయంలో హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మత్తు పదార్థాల విక్రయం.. నలుగురి అరెస్టు

అడయార్, మే 8: స్థానిక తండయారుపేట, పెరంబూరులలో మత్తుపదార్థాలు విక్రయించిన నలుగురు వ్యాపారులను నగర పోలీసులు అరెస్టు చేశారు. షావుకారుపేటలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు ఫ్లవర్‌బజార్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సమాచారం వచ్చింది. దీంతో ప్రత్యేక బృందం మఫ్టీలో ఆ ప్రాంతంలో నిఘావేసి మత్తుపదార్థాలను విక్రయిస్తున్న దేవారాం, హర్దీప్‌రామ్, హైత్రీరామ్‌లను వారిని అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అదేవిధంగా పెరంబూరు, ఒట్టేరిలో డ్రగ్స్ విక్రయిస్తున్న సంతోష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, 50 గ్రాములు కేటమైన్ స్వాధీనం చేసుకున్నారు.

వేంగైవయల్ వ్యవహారం... ముగ్గురికి స్వరపరీక్షలు

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా వేంగైవయల్ గ్రామంలోని ఎస్సీఎస్టీలు నివసిస్తున్న ప్రాంతంలోని వాటర్ ట్యాంక్‌లో మానవవ్యర్థాలు కలిపిన కేసు విచారణలో భాగంగా నగరంలోని ఫోరెన్సిక్ విభాగంలో ఆ గ్రామానికి చెందిన ముగ్గురికి బుధవారం స్వర పరీక్ష నిర్వహించారు. సీబీసీఐడీ పోలీసులు ఆ సంఘటనపై విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. నెలలు గడిచినా ఆ ట్యాంక్ మానవ వ్యర్థాలను కలిపిన నేరస్థులను గుర్తించడం సీబీసీఐడీకి కష్టంగామారింది. ఈ పరిస్థితుల్లో సాంకేతికపద్ధతులద్వారా సాక్ష్యాలను సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా పుదుకోట కోర్టు అనుమతితో ముగ్గురు వ్యక్తులకు నగరంలోని డీజీపీ కార్యాలయం సమీపంలో ఉన్న ఫోరెన్సిక్ విభాగంలో స్వరపరీక్షలు జరిగాయి. వాటి ఫలితాలను బట్టి వేంగైవయల్ నీటి తొట్టిలో మానవవ్యర్థాలను కలిపిన దుండగులను సులువుగా గుర్తించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. నీటితొట్టిలో మానవవ్యర్థాలు కలిపిన రోజు ఆ గ్రామంలో ఆ విషయాన్ని ప్రస్తావించిన కొందరి గురించి పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఆ మాటలు మాట్లాడిన వ్యక్తులను సాంకేతికపరంగా గుర్తించడానికి గాను ముగ్గురు అనుమానితులకు ఈ స్వరపరీక్షలు జరిపారు.

విల్లుపురం స్ట్రాంగ్ రూమ్ వద్ద మళ్లీ మొరాయించిన సీసీ కెమెరాలు

పెరంబూర్, మే 8: విల్లుపురంలో ఈవీఎంలున్న స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు మళ్లీ మొరాయించడం కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు గత నెల 19వ తేది పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి భద్రపరిచారు. ఈ క్రమంలో, ఇటీవల నీలగిరి, తిరుప్పూర్, ఈరోడ్, విల్లుపురం తదితర జిల్లాల్లో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదనే ఫిర్యాదులున్నాయి. సాంకేతికలోపం కారణంగా ఏర్పడిన ఈ సమస్యను సత్వరం సరిచేసినట్లు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, విల్లుపురంలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరా మళ్లీ పనిచేయకపోవడం కలకలం రేపింది. విల్లుపురం అరింజర్ అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల్లో మూడంచెల భద్రత మధ్య ఈవీఎంలు ఉంచారు. బుధవారం ఉదయం విల్లుపురంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం 7 గంటల సమయంలో స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు పనిచేయలేదు. సుమారు గంట సేపు 7 కెమెరాలు పనిచేయలేదని, అనంతరం సరిచేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ పళని తెలిపారు.

జలాశయాల్లో 50 టీఎంసీల నీటినిల్వలు

పెరంబూర్, మే 8: జలవనరుల శాఖ పరిధిలోని 90 జలాశయాల్లో 50 టీఎంసీల నీటినిల్వలు మాత్రమే ఉన్నాయి. ఈ జలాశయాల పూర్తి సామర్థ్యం 224 టీఎంసీలు కాగా, మేట్టూరు, భవానీసాగర్, ముల్లైపెరియార్, పరంబికుళం తదితర 15 పెద్ద జలాశయాల సామర్థ్యం మాత్రంఏ 198 టీఎంసీలు. అలాగే, నగరానికి తాగునీరు అందించే పుళల్, పూండి, చోళవరం, చెంబరంబాక్కం, తేర్వాయ్ కండిగ తదితరాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.7 టీఎంసీలు కాగా, మిగిలిన జలాశయాలు అంతకంటే తక్కువ సామర్థ్యం ఉన్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం 90 జలాశయాల్లో నీటినిల్వలు 50.7 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడం నీరు తగ్గేందుకు కారణమని, నీటిమట్టాలు తగ్గడంతో పలు జిల్లాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

పుదుచ్చేరిలోనూ ఈ-పాస్ విధానం అమలుపరచాలి

● అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ డిమాండ్

పుదుచ్చేరి, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహనాల రద్దీ నియంత్రించేలా కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఈ-పాస్ విధానం అమలుపరచాలని ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామిని అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... దేశంలో పలు రాష్ట్రాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ముఖ్యంగా ఈ వేసవి సీజన్‌లో చల్లటి వాతావరణం ఉన్న ప్రాంతాలకు వెళ్తున్న పర్యాటకుల వల్ల రద్దీ నెలకొందన్నారు. ఆ రీతిలో పుదుచ్చేరికి ప్రతిరోజు వస్తున్న వాహనాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, దీనిని నివారించేలా తమిళనాడులోని ఊటీ, కొడైకెనాల్‌లో లాగే పుదుచ్చేరిలో కూడా ఈ-పాస్ విధానం పరిచయం చేయాలని కోరారు.

రెండు రోజుల్లో 26,694 ఈ-పాస్‌లు

పెరంబూర్, మే 8: ప్రముఖ పర్యాటక కేంద్రం దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌కు ఈ-పాస్ తప్పనిసరి చేయడంతో, ఈ విధానం అమలుకు వచ్చిన తొలి రోజైన మంగళవారం 1,217 వాహనాలను అనుమతించారు. అలాగే, 6,7 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న 26,694 వాహనాలకు ఆయా రోజులకు ఈ-పాస్‌లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో ఊటీ, కొడైకెనాల్ వెళ్లే వాహనాలకు ఈ-పాస్ తప్పనిసరి అయిన విషయం తెలిసిందే.

ఈ-పాస్ విధానం రద్దు చేయాలి

పెరంబూర్, మే 8: నీలగిరి జిల్లాలో ఈ-పాస్ విధానం రద్దు చేయాలని కాటేజీ యజమానుల సంఘం డిమాండ్ చేసింది. ఈ విధానం అమలుతో ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గి కాటేజీలతో పాటు స్థానిక వ్యాపారులు నష్టపోతారన్నారు. ఈ విధానం రద్దు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా కాటేజీలు మూసివేస్తామని ఆ సంఘం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

810 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, మే 8: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 810 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఒకటో కేంద్రంలోని 3 యూనిట్‌లో సాంకేతికలోపం కారణంగా 210 మెగావాట్లు, రెండో కేంద్రంలోని 2వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా మరో 600 మెగావాట్లు మొత్తం 810 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తిచేసిన వెంటనే ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

సెంట్రల్ సమీపంలో బస్సుపైకెక్కి రగడ

● 20 మంది విద్యార్థులపై కేసు నమోదు

పెరంబూర్, మే 8: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో బస్సు పైకెక్కి రగడ చేసిన 20 మంది విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం సెంట్రల్ రైల్వేస్టేషన్ బస్టాండ్‌లోకి ఎంటీసీ బస్సు వచ్చిన సమయంలో ఒక్కసారిగా విద్యార్థులు కిటికీలు, బస్సుపైకెక్కి ఈలలు, కేకలు వేస్తూ హంగామా చేశారు. విద్యార్థుల ఆగడాలతో ప్రయాణికులు, చుట్టుపక్కల వారు భయాందోళన చెందారు. ఆ ప్రాంతంలో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకొనేలోపు వారు పరారయ్యారు. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజీ ఆధారంగా 20 మంది విద్యార్థులపై కేసు నమోదుచేసిన పోలీసులు, వారి కోసం గాలిస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మే 8: నగరంలో గంజాయి విక్రయిస్తున్న మహిళ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐస్‌హౌస్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆ ప్రాంతంలో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గంజాయి విక్రయిస్తున్న సయ్యద్ బషీర్ భాషా, అయన స్నేహితురాలు రహమత్ నిషాను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మత్తు మాత్రలు విక్రయించిన ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, మే 8: స్థానిక షోలింగనల్లూర్ నియోజకవర్గ పరిధిలోని కన్నగినగర్‌లో మత్తు మాత్రలు విక్రయించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కన్నగినగర్, ఎళిల్ నగర్ ప్రాంతాల్లో మద్యం, గంజాయికి బానిసలైన కొంత మందికి మత్తు మాత్రలను విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు మంగళవారం ఆ ప్రాంతాల్లో మాటు వేశారు. కన్నగినగర్‌లో మత్తు మాత్రలు విక్రయిస్తున్న ప్రకాష్ (22), శరవణన్ (28), కార్తీక్ (23) లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 350 మత్తు మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఇప్పటికే మాదకద్రవ్యాల అక్రమ తరలింపు కేసులున్నట్లు విచారణలో తెలిసింది.

బాలుడిపై పెంపుడు శునకం దాడి

పెరంబూర్, మే 8: స్థానిక ఆలందూర్ పోలీస్ క్వార్టర్స్‌లో సైబీరియన్ హస్కీ పెంపుడు శునకం అశ్వంత్ అనే బాలుడిపై దాడిచేయడంతో చేతికి గాయమైంది. శునకాన్ని పెంచే వ్యక్తిపై సెయింట్ థామస్ మౌంట్ పోలీసులు కేసు నమోదుచేశారు. వేళచ్చేరికి చెందిన అశ్వంత్ (11) వేసవి సెలవులు కావడంతో ఆలందూర్ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్న తన బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం ఆ ప్రాంతంలో అశ్వంత్ ఆడుకుంటున్న సమయంలో, అదే క్వార్టర్స్‌లో పెంపుడు శునకం అశ్వంత్‌పై దాడిచేసింది. అశ్వంత్ చేతికి గాయం కావడంతో బాలుడి కేకలకు అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అశ్వంత్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో శునకం యజమానిపై కేసు నమోదుచేశారు. రెండు రోజుల క్రితం నుంగంబాక్కంలోని పార్క్‌లో బాలికపై పెంపుడు శునకాలు దాడిచేసిన నేపథ్యంలో, మళ్లీ అలాంటి ఘటన చోటుచేసుకోవడం నగరవాసులను భయభ్రాంతులను చేస్తోంది.

బయల్పడిన నంది, విష్ణువు విగ్రహాలు





ఐసిఎఫ్, మే 8: తంజావూరులో నంది, విష్ణుమూర్తి విగ్రహాలు, శిలాఫలకాలు లభ్యమయ్యాయి. తంజావూ రు జిల్లా బూదలూరు చిత్తిరంగుడి ప్రాంతంలోని ఓ తోటలో సగానికి పైగా భూమిలో కూరుకుపోయిన నంది విగ్రహం కనిపించింది. గమనించిన స్థానికులు తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయ అధికారులకు, పురావస్తుశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... తోటలో కనుగొన్న నంది విగ్రహం 9,10 శతాబ్దాలకు చెందిఉంటుందని తెలిపారు. అలాగే, ఆనందకావేరి కాలువ సమీపంలో మూడడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని గుర్తించామన్నారు. నంది అడుగున రెండు శిలాఫలకాలు కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

'రసవాది' ఓ కొత్త అనుభూతినిస్తుంది


'రసవాది' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

● దర్శకుడు శాంతకుమార్

చిత్రజ్యోతి

'మహాముని', 'మౌనగురు' వంటి చిత్రాల అనంతరం చాలా గ్యాప్ తర్వాత తెరకెక్కించిన 'రసవాది' చిత్రం కొత్త అనుభూతినిస్తుందని ఆ చిత్ర దర్శకుడు శాంతకుమార్ అన్నారు. శుక్రవారం విడుదలయ్యే ఈ చిత్రాన్ని చూసిన ప్రేక్షకులు సినిమా బాగుందని చెబితే ఆ క్రెడిట్ తన టీమ్‌కు చెందుతుందని ఆయన వ్యాఖ్యానించారు. డీఎన్ఏ మెకానిక్ కంపెనీ, సరస్వతి సినీ క్రియేషన్స్ నిర్మాణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అర్జున్ దాస్, తాన్య రవిచంద్రన్ జంటగా నటించారు. ఈ చిత్రం విడుదలను పురస్కరించుకుని ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శకుడు శాంతకుమార్ మాట్లాడుతూ, ' సినిమా బాగుందని చెబితే దానికి కారణం నా టీమ్. నటీనటులు, సాంకేతిక సిబ్బంది. పబ్లిసిటీ ఇలా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేస్తారు. 'రసవాది' బాగా చేసింది. నా మొదటి రెండు చిత్రాల తర్వాత ఈ సినిమా డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందన్నారు. హీరో అర్జున్ దాస్ మాట్లాడుతూ, 'ఈ సినిమా తమిళంతోపాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం. శాంతకుమార్ దర్శకత్వంలో నటించాలన్నది నా కల ఈ సినిమా ద్వారా నెరవేరినందుకు సంతోషంగా ఉంది. సినిమా చూసి ఆదరించాలని కోరుతున్నానన్నారు. హీరోయిన్ తాన్య రవిచంద్రన్ మాట్లాడుతూ, 'ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడికి ధన్యవాదాలు. అర్జున్ దాస్‌తో సహా ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు తాను నటించిన చిత్రాల్లోని కథా పాత్రలకు ఇందులోని పాత్ర భిన్నంగా ఉంటుంది' అన్నారు.

విమల్ - కరుణాస్ ప్రధాన పాత్రల్లో కొత్త చిత్రం


ఫస్ట్‌లుక్ ఆవిష్కరిస్తున్న వెట్రిమారన్ తదితరులు

విమల్ - కరుణాస్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతుంది. 'పోగుమిడం వెగుదూరమిల్లై' అనే టైటిల్ ఖరారు చేశారు. షార్క్ 9 పిక్చర్స్ పతాకంపై శివా కిలారీ నిర్మాణంలో తెరకెక్కింది. కొత్త దర్శకుడు మైఖేల్ కె.రాజా దర్శకత్వం. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు వెట్రిమారన్ రిలీజ్ చేశారు. విమల్, కరుణాస్, ఒక కారు ఉండగా, టైటిల్‌కు యాప్ట్‌గా ఉండేలా ఈ ఫస్ట్‌లుక్ డిజైన్ చేశారు. వైవిధ్య భరితమైన కథతో హృదయాన్ని హత్తుకునేలా ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చెప్పారు. 'మార్చురీ వ్యాను డ్రైవరుగా నటించే విమల్... తన అవసరం కోసం తిరునెల్వేలికి ఒక ప్రముఖుడి మృతదేహాన్ని తీసుకెళతాడు. చెన్నై నుంచి తిరునెల్వేలికి ఒక మృతదేహాన్ని తీసుకెళ్ళే జర్నీనే ఈ చిత్ర ప్రధాన కథాంశం' అని పేర్కొన్నారు. ఇతర పాత్రల్లో నరేన్, మనోజ్ కుమార్, భవన్, అరుళ్‌దాస్, దీపా శంకర్, చార్లెస్ వినోద్, వేల్ రామమూర్తి తదితరులు నటిస్తున్నారు. చిత్రీకరణ ఇప్పటికే పూర్తి చేసుకున్న ఈ చిత్రం టీజర్, ట్రైలర్ త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కమల్ 'థగ్‌లైఫ్'లో శింబు



● అధికారికంగా వెల్లడి

విశ్వనటుడు కమల్ హాసన్, దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'థగ్‌లైఫ్'. ఈ చిత్రంలో కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ హీరో శింబు నటించనున్నారు. ఈ విషయాన్ని బుధవారం చిత్ర నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. 'నాయగన్' చిత్రం తర్వాత కమల్ - మణిరత్నం కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో త్రిష, అభిరామి, గౌతం కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్య లక్ష్మి తదితరులు నటిస్తున్నారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం. కమల్ హాసన్ త్రిపాత్రాభినయం చేసే ఈ చిత్రాన్ని రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. నిజానికి ఈ సినిమాలో మలయాళ యువ నటుడు దుల్కర్ సల్మాన్, తమిళ నటుడు జయం రవిని ఎంపిక చేయగా, అనివార్య కారణాలతో వీరిద్దరూ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దీంతో శింబును తాజాగా ఎంపిక చేశారు. కాగా ఇప్పటికే అరుణ్ విజయ్‌ను ఎంపిక చేసిన విషయం తెల్సిందే.

'బ్లడీ బెగ్గర్'గా కవిన్

'డాడా' మూవీ వంటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న యువ హీరో కవిన్‌కు వరుస సినీ అవకాశాలు వరిస్తున్నాయి. ఈ నెల 10న 'స్టార్'గా ప్రేక్షకుల ముందుకువస్తున్నారు. ఈ చిత్రానికి ఇలన్ దర్శకుడు. అలాగే, సతీష్ కృష్ణన్ దర్శకత్వంలో 'కిస్' అనే చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఇపుడు మరో ప్రాజెక్టును అంగీకరించారు. సెన్సేషనల్ యంగ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ నిర్మించే చిత్రంలో కవిన్ హీరోగా నటిస్తున్నారు. 'బ్లడీ బెగ్గర్' అనే టైటిల్ ఖరారు చేసి, ప్రోమో రిలీజ్ చేశారు. నెల్సన్ దిలీప్ కుమార్ వద్ద అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేసిన శివబాలన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. హీరోయిన్‌గా అక్షయను ఎంపిక చేశారు. జైలర్ ధన్‌రాజ్, అనార్కలి నాజర్, రెడిన్ కింగ్‌స్లీ తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. ఫిలమెంట్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జాన్ మార్టిన్ సంగీతం సమకూరుస్తున్నారు.



తలసేమియాపై అవగాహన అవసరం


తలసేమియా దినోత్సవ సభలో పాల్గొన్న నటి సుహాసిని, డాక్టర్ రేవతి రాజ్ తదితరులు

● నటి సుహాసిని మణిరత్నం

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): జన్యు రుగ్మత అయిన తలసేమియాపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీనటి సుహాసిని మణిరత్నం అన్నారు. తరమణిలోని వీహెచ్ఎస్ హాస్పిటల్‌లో తలసేమియా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తలసేమియా దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన ప్రత్యేక సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తదానం చేసి వ్యక్తిగా తానీ సభలో పాల్గొన్నానని సభికుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. అపోలో హాస్పిటల్స్ క్యాన్సర్ సెంటర్ పీడియాట్రిక్ హెమటాలజిస్ట్ డాక్టర్ రేవతి రాజ్ మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పుడు చేసే వైద్యపరీక్షల సమయంలోనే తలసేమియా పరీక్షలు కూడా చేసుకుంటే ఈ రుగ్మత నిరోధించవచ్చన్నారు. ముందస్తు వైద్య పరీక్షల ద్వారానే తలసేమియాను నిరోధించగలమని చెప్పారు. అదే సమయంలో తలసేమియా బాధితులకు అవసరమైన రక్తం అందించేందుకు యువత ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినెలా 160 తలసేమియా బాధితులకు వీహెచ్ఎస్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నామని, బాధిత చిన్నారుల తల్లిదండ్రులందరినీ సభ్యులుగా చేర్చి ప్రత్యేక సంఘాలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఆ సంఘాల సభ్యులు తలసేమియా రోగులకు తగిన సహాయ సహకారాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. తలసేమియా నిరోధించేందుకు ఎముకల గుజ్జు (బోన్ మారో) మార్పిడి చికిత్స దోహదపడుతుందని, బాధితుల సమీప బంధువులు లేదా తోబుట్టువులు ఎముకల గుజ్జు దానం చేయవచ్చునని ఆమె వివరించారు.

సబర్బన్ రైళ్ల ఆలస్యం

● ప్రయాణికుల రైల్‌రోకో

పెరంబూర్, మే 8: సబర్బన్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నాయంటూ కొరుక్కుపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు బుధవారం ఉదయం రైల్‌రోకో చేపట్టారు. గుమ్మిడిపూండి-చెన్నై మధ్య నడుస్తున్న సబర్బన్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా, ఉదయం వేళల్లో కార్యాలయాలు, ఇతర పనుల కోసం నగరానికి రావాలనుకొనేవారు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడతో సమయానికి చేరుకోలేకపోతున్నారు. అదే సమయంలో, కొరుక్కుపేట రైల్వేస్టేషన్‌లో సిగ్నల్ లభించక అరగంటకు పైగా సబర్బన్ రైళ్లను నిలిపివేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం సుమారు గంట ఆలస్యంగా సబర్బన్ రైలు రావడంతో ఆగ్రహం చెందిన ప్రయాణికులు పట్టాలపై బైఠాయించి రైల్‌రోకో చేపట్టారు. సకాలంలో రైళ్లు నడపాలని నినాదాలు చేశారు.


రైల్‌రోకో చేపట్టిన ప్రయాణికులు



ఎడ్యుకేషన్ ఫెయిర్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కాన్సులేట్ జనరల్ ఓలేగ్ అవదీవ్, రవిచంద్రన్ తదితరులు

11,12 తేదీల్లో చెన్నైలో రష్యన్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్యారీస్, మే 8: ఈ నెల 11,12 తేదీల్లో ఆలిండియా రష్యన్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సులేట్ జనరల్ ఓలేగ్ అవదీవ్ తెలిపారు. ఆళ్వార్‌పేటలోని రష్యన్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచలోనే నాణ్యమైన వైద్య విద్య అందించడంలో రష్యన్ విశ్వవిద్యాలయాలు దీర్ఘకాలంగా పేరొందాయన్నారు. భారతదేశానికి చెందిన విద్యార్థులకు ఈ నెల 11,12 తేదీల్లో రష్యన్ ఎడ్యుకేషన్ ఫెయిర్ జరుగుతుందని తెలిపారు. ఈ ఫెయిర్ ద్వారా భారతీయ విద్యార్థులకు 8,000 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. ఈ నెల 14న మదురైలోని రెసిడెన్సీ హోటల్‌లో, 15న తిరుచ్చి ఎమినో హోటల్‌లో, 16న సేలం జీఆర్ హోటల్, 17న కోయంబత్తూర్‌లో గ్రాండ్ రీజియంట్‌లో ఎడ్యుకేషన్ ఫెయిర్ జరుగుతుందని, మరిన్ని వివరాలకు 9282221221 అనే నెంబరు సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రన్, అలెగ్జాండర్ డాడోనావ్ తదితరులు పాల్గొన్నారు.

'అమృత'లో ఏవియేషన్ కాలేజీ ప్రారంభం

ప్యారీస్, మే 8: చెన్నైస్ అమృతలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ కాలేజీని ఆ సంస్థ అధినేత ఆర్.భూమినాథన్ ప్రారంభించారు. ఎగ్మూర్‌లోని హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి భూమినాథన్ అధ్యక్షత వహించగా, అన్నా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ శివకుమార్, సంస్థ సీఈవో కవిత నందకుమార్, విద్యాశాఖ డైరెక్టర్ లియోప్రసాద్, డీన్ మిల్టన్, భానుమతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భూమినాథన్ మాట్లాడుతూ... హోటల్ మేనేజ్‌మెంట్ విద్యా విభాగంలో దేశంలోనే తమ సంస్థ వేగంగా అభివృద్ధి చెందుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఇండియా, ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో పౌర విమానయాన సేవలు పెరుగుతున్న దృష్ట్యా తమ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ కాలేజీని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు 9363300400 నెంబరు సంప్రదించవచ్చని భూమినాథన్ తెలిపారు.



ఏవియేషన్ కాలేజీని ప్రారంభిస్తున్న అమృత గ్రూప్ సంస్థల చైర్మన్ భూమినాథన్

కాట్పాడిలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం


హెన్నీ డునాండ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నిర్వాహకులు

వేలూరు, మే 8: రెడ్‌క్రాస్ కాట్పాడి డివిజన్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం నిర్వహించారు. గాంధీ నగర్‌లోని శాఖా గ్రంథాలయం, యూని టీ ఆఫ్ యూత్ ట్రస్ట్ సం యుక్త ఆధ్వర్యంలో కాట్పాడి రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ స్థాపకులు హెన్నీ డునాండ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి రెడ్‌క్రాస్ అవై అధ్యక్షుడు జనార్ధనన్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, విజయకుమారి, కోశాధికారి పళని పాల్గొని రెడ్‌క్రాస్ సేవలను వివరించారు. తొలుత సెక్రటరీ శివవడివు ఆహ్వానం పలుకగా యూత్ ట్రస్ట్ జిల్లా ఆర్గనైజర్ వైశాలి, రాణిపేట జిల్లా ఆర్గనైజర్ సంధ్య, దేవదర్శిని, విజయన్, ఎస్.దుర్గా, కౌసిక్, మాలతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందజేయగా, గ్రంథాలయాధికారి మంజుల వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

పిల్లల వార్డుకు టీవీ బహూకరణ


ఆస్పత్రి డీన్‌కు టీవీ అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, మే 8: స్థానిక అడుక్కమ్‌పారై ప్రభుత్వాసుపత్రి పిల్లల వార్డులో టీవీ ఉంటే బాగుంటుందని వైద్యులు భావించారు. ఈ విషయం తెలుసుకున్న అలమేలు రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజసేవకుడు దినేష్ శరవణన్ ఎల్ఈడీ కలర్ టీవీని బహుమతిగా అందజేందుకు ముందుకొచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి డీన్ రాజవేల్‌కు దినేష్ శరవణన్ టీవీ అందజేశారు.

దురై దయానిధికి సీఎం పరామర్శ

వేలూరు, మే8: తీవ్ర అనారోగ్యంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేంద్ర మాజీమంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం సాయంత్రం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా ఆస్పత్రికి వెళ్లిన స్టాలిన్ తన సోదరుడి కుమారుడైన దురై దయానిధి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం కొద్ది సేపు అక్కడే అళగిరి కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం చెన్నై బయలుదేరి వెళ్లారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం దురై దయానిధి ఆరోగ్యం నిలకడగా ఉందని సీఎంసీ వైద్యులు తెలిపారు.

పులు పెక్కిన నిమ్మకాయ

● కిలో ధర రూ.200



చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో అగ్ని నక్షత్రం ప్రభావిత ఎండల కారణంగా నిమ్మకాయలకు డిమాండ్ అధికమైంది. ప్రస్తుతం నగరమంతటా రోడ్‌సైడ్ తోపుడు బండ్లలో, శీతలపానీయాల దుకాణాల్లో, ఇళ్ళల్లో నిమ్మరసం తాగేవారే సంఖ్య అధికమైంది. దీనితో కోయంబేడు మార్కెట్‌లో నిమ్మ కాయల అమ్మకాలు పెరిగాయి. కోయంబేడు మార్కెట్‌కు రోజూ ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, రాజంపేట, కలికిరి తదితర ప్రాంతాల నుంచి ఎనిమిది లారీల్లో సుమారు 80 టన్నుల దాకా నిమ్మకాయలు దిగుమతవుతున్నాయి. గత నెల రోజులుగా కిలో కాయలు రూ.100లకు విక్రయించే వారు. ప్రస్తుతం కిలో నిమ్మపండ్లను రూ.200లకు విక్రయిస్తున్నారు.

స్వర్ణాలయం 23వ వార్షిక వేడుకలు

● పాల్గొన్న అసోం, కర్ణాటక గవర్నర్లు


శక్తి అమ్మతో అసోం, కర్ణాటక గవర్నర్లు

వేలూరు, మే 8: నారాయణి స్వర్ణాలయం ఆవరణలో 23వ వార్షిక వేడుకల సందర్భంగా నిర్వహించిన నారాయని మూలమంత్ర మహా యజ్ఞంలో అసోం గవర్నర్ గులాబ్‌చంద్ కట్టారియా, కర్ణాటక గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ పాల్గొన్నారు. ముందుగా నారాయణి పాఠశాల నుంచి 10,009 మంది పసుపు నీటి బిందెలతో ఊరేగింపుగా వచ్చారు. అనంతరం పీఠంలోని స్వయంబు అమ్మవారికి అభిషేకం చేశారు. శక్తి అమ్మ అభిషేకాలు చేసి దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో తమిళనాడు, ఆంధ్ర, కేరళ సహా పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రపంచ క్షేమం, వర్షాలు సమృద్ధిగా కురవాలి, వాతావరణంలో మార్పులు లేకుండా ఉండాలి, రైతులకు అధిక దిగుబడి రావాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు పీఠం నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల ఏర్పాట్లను ట్రస్టీ సౌందర్‌రాజన్, పీఠం మేనేజర్ సంపత్, స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు పర్యవేక్షించారు.

ప్రారంభమైన టి.నగర్ ఫ్లై ఓవర్ కూల్చివేత పనులు



ఐసిఎఫ్, మే 8: స్థానిక టి.నగర్ ఫ్లై ఓవర్ కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా ఉస్మాన్ రోడ్డు నుంచి అన్నాసాలై వరకు కొత్త ఫ్లై ఓవర్ నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. దురైస్వామి రోడ్డు-ఉస్మాన్ రోడ్డు జంక్షన్ వరకు ఉన్న ఫ్లై ఓవర్ దక్షిణ భాగాన్ని తొలగించి అక్కడి నుంచి సౌత్ ఉస్మాన్ రోడ్డు మీదుగా అన్నాసాలై జంక్షన్ వరకు 1.2 కి.మీ కొత్త ఫ్లై ఓవర్‌ను రూ.131 కోట్లతో టూ వేగా నిర్మించనున్నారు. ఈ పనుల కోసం ఏప్రిల్ 28 నుంచి ట్రాఫిక్ మార్పులు ప్రకటించారు. ప్రస్తుతం కూల్చివేత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.


చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తమిళంలో రాసిన 'మీలో ఒకడిని' అనే స్వీయచరిత్ర మలయాళ అనువాద పుస్తకాన్ని ఆయనకు అందిస్తున్న టీసీ బుక్స్ ప్రచురణకర్త గోవింద్

జన చేతనం



గురువారం 9 మే 2024

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

ఆర్భాటపు నేత

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఏది చేసినా ఆర్భాటం, హడావుడి ఆకాశాన్నంటుతుంది. కరోనా సాయం అయినా, దేవుడి ఉత్సవం అయినా ప్రదర్శనకే ప్రాధాన్యం ఇస్తారు.

- ఊరందూరులో ఒక మహానగరమే రాబోతోందంటూ సీఎంతో ఇళ్ల కాలనీకి శంకుస్థాపన చేసిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడక్కడ కనీస సదుపాయాలు కూడా లేక పది కుటుంబాలే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాయి.
- ఇనగలూరు వద్ద అపాచీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామంటూ ఊరూవాడా హోరెత్తించారు. సీఎం జగన్ స్వయంగా వచ్చి 2022 జూన్ 23వ తేదీన భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఆ మరుసటి రోజే శిలాఫలకం అదృశ్యమైంది. పరిశ్రమ నెలకొల్పే పనులు కనీసంగా కూడా మొదలు కాలేదు.


శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రజా దర్బార్‌ల గురించి జనం కథలు కథలుగా చెప్పుకుంటారు. ఎవరు ఏ పనితో వచ్చినా పలకరించి కూర్చోబెట్టి వింటారు. అర్జీ తీసుకుని అనుచరులకు అప్పగిస్తారు. పనులపై వచ్చినవారు ఆయన రిసీవింగ్‌కి సంబరపడిపోతారు. అంతే.. ఆ తర్వాత అతీగతీ ఉండదు. ఆయన దర్బార్ దీనికే పరిమితం కాదు. మాట వినని, దారికి రాని వారి సంగతి తేల్చే పనులూ అక్కడే పురమాయిస్తారని చెబుతారు. శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయాన్నే అవినీతితో అపవిత్రం చేసేసిన ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదనరెడ్డి గురించి జనం చెప్పుకుంటారు. ఆయన అనుచరగణం రౌడీయిజం గురించి, దౌర్జన్యాల గురించి ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా స్పందించరు. తన స్టయిలే వేరన్నట్టుగా వ్యవహరిస్తారు. ఈ ఐదేళ్లూ ఆయన రాజకీయ, పాలనా శైలి, అభివృద్ధి అంటని తీరూ... ఎన్నికల వేళ చర్చగా మారాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రౌడీ దర్బార్

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి స్టయిలే వేరు.

ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం



భూకబ్జాలు.. ఇసుక దోపిడీ

- నియోజకవర్గంలో మట్టి, ఇసుక, గ్రావెల్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలతో ఎమ్మెల్యే రూ. కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి.
- నియోజకవర్గంలో ఎక్కడా ప్రభుత్వ పోరంబోకు, బంజరు భూములు మిగల్లేదన్న ఆరోపణలు వచ్చాయి. వాటిల్లో వెంచర్లు వేసి, ప్రైవేటు సంస్థలకు విక్రయించి భారీగా సంపాదించారనే ఆరోపణలున్నాయి.

ముక్కంటి వెండిని దోచేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, భార్య, అత్త కలిసి ఆలయం నుంచి వెండిని అక్రమంగా బెంగళూరుకు తరలించి అమ్మేస్తున్నారని ఎమ్మెల్యే అనుచరుడు హేమచంద్రారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. వెండికి సంబంధించిన రూ.10 లక్షల నగదు తన ఖాతాకు జమ చేసినట్లు తెలియజేశారు. లాక్‌డౌన్ సమయంలో మద్యం దుకాణాల నుంచి తరలించి సొమ్ముచేసుకున్నారని కూడా ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు కూడా చేయడం సంచలనం అయ్యింది.



శ్రీకాళహస్తి ప్రజల చెవిలో పూలు

హామీ: మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ పరిశ్రమను పూర్తి చేయించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.
అమలు: ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోనేలేదు.

హామీ: సోమశిల స్వర్ణముఖి లింకు కాలువను పూర్తి చేసి రైతులకు అంకితమిస్తాం.
అమలు: టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప కనీసం ఒక్క అడుగు కూడా కాలువ పనులు జరగలేదు.

హామీ: శ్రీకాళహస్తి మున్సిపల్ వార్డుల్లోనూ, గ్రామాల్లోనూ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు పెట్టి శుద్ధజలం సరఫరా చేస్తాం.
అమలు: ఆ దిశగా కనీస ప్రయత్నం చేయలేదు.

హామీ: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్విమ్స్ తరహాలో వైద్య సేవలు అందిస్తాం.
అమలు: ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు అంతస్తు నిర్మించి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీ లేదు.

హామీ: శ్రీకాళహస్తిలో మెడికల్ కాలేజీ నెలకొల్పుతాం.
అమలు తీరు: ఐదేళ్లలో ఎక్కడా ఆ ప్రస్తావన కూడా తీసుకురాలేదు.

హామీ: స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను జేఎన్టీయూకు అప్పగించి మరింత అభివృద్ధి చేస్తాం.
అమలు: ఎమ్మెల్యేగా గెలిచాక స్కిట్ కళాశాల పూర్తిగా మూతపడింది.

హామీ: స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేసి, సుందరీకరణ చేస్తాం.
అమలు: ఐదేళ్లూ కాలక్షేపం చేసి, ఎన్నికల షెడ్యూలు వెలువడే ముందు శంకుస్థాపన చేసి హడావిడి చేశారు. పనులు మాత్రం మొదలు కాలేదు.

దాడులు.. దౌర్జన్యాలు

శ్రీకాళహస్తిలో ఈ ఐదేళ్లలో రౌడీయిజం, దాడులు, పెరిగిపోయాయి. ఎమ్మెల్యే అనుచరగణం దబాయింపులకూ, దౌర్జన్యాలకూ అంతులేదు.

- టిఫిన్ సెంటర్ నడుపుకునే మునిరాజమ్మను యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ పలకరించారు. ఆమె తన సమస్యలు చెప్పుకుంది. ఇవి మీడియాలో రావడంతో వైసీపీ నేతలు దాడి చేశారు. టిఫిన్ అంగడి ధ్వంసం చేశారు. ఎదురు ఆమె మీదే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.
- ఎమ్మెల్యే తన ఆస్తులు గుంజుకున్నారని, ఆయనతో తనకు ప్రాణహాని వుందని స్వయంగా ఎమ్మెల్యే భార్య సోదరుడు సామాను శ్రీధర్‌రెడ్డి మీడియా సమావేశంలో ఆరోపించారు.
- నియోజకవర్గంలోని పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి వాటాలు వసూలు చేశారని, ట్రాన్స్‌పోర్టులు, ఉద్యోగాల నియామకం వంటి కాంట్రాక్టులు బలవంతంగా దక్కించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఓ ప్రముఖ పరిశ్రమ విషయంలో వేధింపులకు దిగారని, యాజమాన్యం తనకున్న సంబంధాలతో కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్ళడంతో వారి ద్వారా తీవ్ర మందలింపులకు గురయ్యారనే ప్రచారం జరుగుతోంది.
- స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు, దాడులకు, కిడ్నాప్‌లకు పాల్పడిన ఉదంతాలున్నాయి.
- పాల సరఫరా సహకార సంఘం ఎన్నికల్లో నామినేషన్ వేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు కారుపై వైసీపీ కార్యకర్తలు పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ కూడలిలో రాళ్ళతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

జంగమయ్య సన్నిధిలో అవినీతి తాండవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతి తాండవించింది. అంది వచ్చిన ప్రతీ అవకాశంలో స్వలాభం చూసుకున్నారు. పారిశుధ్యం కోసం ఉపయోగించే చీపురు పుల్లల దగ్గర నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ వరకూ అన్ని స్థాయిల్లోనూ అందిన కాడికి దోచేశారు.

- అయిన వారికే కాంట్రాక్టులు కట్టబెట్టడం. వాటి నుంచి కమీషన్లు గుంజేయడం చేశారు. సెల్ ఫోన్, లగేజీ, కార్ పార్కింగ్, టెండర్లలో భక్తుల నుంచి అధిక ధరలతో దోపిడీ చేశారు.
- గోశాలలో గడ్డి కొనుగోళ్ల వ్యవహారంలో గోల్‌మాల్ చేశారు.
- ఆలయ నిధులతో ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు అడ్డం పెట్టుకొని అవసరం లేని నిర్మాణ పనులన్నీ చేపట్టారు. కమీషన్ల కక్కుర్తితో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారు.

ఆలయంలో ఆదాయ స్థావరాల్లో విధులు కేటాయించేందుకు ఎవరైనా ముడుపులు చెల్లించాల్సిందే.

- పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కన్నా అధిక సంఖ్యలో పేర్లు నమోదు చేసి లక్షలాది రూపాయలు దోపిడీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ముక్కంటి ఆలయం రాహు కేతు పూజల సమయంలో దోషం పోవాలంటే దక్షిణ చెల్లించాలంటూ భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేశారు. నెలకు రూ.1కోటి చొప్పున పోగవుతుందని అంచనా. అక్రమ సొమ్మును రాహు కేతు పూజల వద్ద పనిచేసే సిబ్బంది మొదలు నాయకుల దాకా వాటాలు వెళ్తాయని ప్రచారం ఉంది.
- వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే తన అనుచరులను ఉచిత సేవకుల పేరుతో పీఆర్‌ఓ కార్యాలయంలో అనధికారికంగా 100 మందిని నియమించారు. వీరు వైట్ కాలర్ దళారీలు దర్జాగా దర్శనాలు చేయిస్తుంటారు. ఎమ్మెల్యే అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా అడ్డదారిలో దర్శనాలు చేస్తుంటారు. ఒక్కో దళారి రోజు సంపాదన రూ.10 వేలకి తగ్గదని చెబుతారు.
- మహాశివరాత్రి ఉత్సవాలలో కాంట్రాక్టులను అయిన వారికే కట్టబెడుతూ భారీగా సొమ్ము మింగేశారు. ఉదాహరణకు ఈ ఏడాది ఎంత ఖర్చు అయ్యిందీ వెల్లడించలేదు.

ఆఫీసుల్లో నిఘా

- నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయాల్లో చీమ చిటుక్కుమన్నా తనకు తెలిసేలా వంద శాతం సిబ్బందిని తనకు కావాల్సిన వారినే నియమించుకున్నారని, వారిలో పరస్పరం ఒకరిపై ఒకరు నిఘా వుండేలా ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా తహసిల్దారు కార్యాలయాల్లో ఏ ఫైలు కదిలినా తన దృష్టికి వచ్చేలా జాగ్రత్త పడ్డారనే ప్రచారముంది. ప్రతి ఫైలూ తనకు తెలిసే, తనకు వాటా వుండేలా ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి.
- భూముల కబ్జా విషయాల్లో సహకరించిన రెవెన్యూ అధికారులపై అత్యున్నత స్థాయి నుంచీ చర్యలకు ఆదేశాలు వచ్చినా వారిని కాపాడారని, కనీసం బదిలీలు కూడా కాకుండా అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి.

రాజుగారి గుండెలుజారిన కత

తిరుగే లేని చక్రవర్తిగా ఐదేళ్లు వైభోగం అనుభవించిన ఆయనకి చిన్న డౌటనుమానం వచ్చింది. తన ముందు చేతులు కట్టుకుని ఎంతో వినయ విధేయతలు ప్రదర్శిస్తూ, తాను నోరు తెరిస్తే వహ్వా.. వహ్వా అంటూ పొగడ్తలతో ముంచెత్తే సామంతరాజుల నిజ స్వరూపం తెలుసుకోవాలని అనిపించింది. రాజు తలచుకుంటే కొదవేముంది? అసలే వేషాలు వేయడంలో మాంచి అనుభవం ఉండడంతో, చీకటి పడ్డాక మారు వేషంలో నగరమంతా తెగ తిరిగేశాడు. టీయంగళ్ల దెగ్గిర, బస్టాండుల్లో జనం మాటలు సైగ్గా విన్నాక కోపం నసాళానికి అంటింది. ఒరలోని కత్తిని కసిగా బయటకీ లోపలకీ రెండుమూడు సార్లు తీసీ తోసీ, మారు వేషంలో ఉన్నామని గుర్తుకొచ్చి.. ఇంక తిరిగేది చాలించేసి కోటకి తిరిగి వచ్చేశాడు. ఉన్నపళంగా అత్యవసర సమావేశానికి రావలసిందిగా సామంతులకు ఆదేశాలు జారీ చేశాడు. ఏమి ఉపద్రవమో అని భయపడతా కొందరూ, మానవత్వం.. మంచితనం అంటూ మళ్లీ అవే నీతి మాటలు ఎన్నిసార్లు వినాల్నో ఏమో అని వణుకుతూ మరికొందరూ అర్ధరాత్రి మీటింగుకి హాజరయ్యారు.

ముళ్ల పొద మీద కూర్చున్నట్టుగా సింహాసనంపై ఉన్న రాజుగారిని చూడగానే మేటర్..సీరియస్సే అని అర్థమైపోయింది అందరికీ. ఎర్రజీరలతో ఉబ్బిన కళ్లతో అందరినీ ఒకసారి కలియజూసి గొంతు సవరించుకుని మొదలు పెట్టాడు..

"ఎవుర్ని నమ్మాలో..ఎవుర్ని అనుమానించాలో అర్థమే కావడం లేదు." అని గ్యాప్ ఇచ్చాడు. ఎప్పుడూ గంభీరంగా వినిపించే ఆయన కంఠంలోని వణుకుని చూసి సామంతులంతా విచిత్రపోయారు.


"పైసాకి పనికిరానోళ్లందరినీ సామంతరాజులను చేశాను కదా! నాముందు చిత్తం దొరా..అంటూనే, నా వెనకాల గూటాలు దించే పని మొదులు పెట్టారు. శత్రుదుర్భేధ్యం అనుకున్న నా కోటకు బీటలేంది? ఏదో మాటవరసకు నేనెంతో సౌమ్యుడిని అని పదే పదే చెప్పాను గదా అని ఎక్కి తొక్కేద్దాం అనుకుంటా ఉండారేమో.. తాట తీస్తా.. ఒక్కొక్కరికీ. ఎగస్పార్టీవాళ్లతో చేతులు కలిపినోళ్లని మేమే ఎండబెట్టిన పేరూరు చెరువులో వేసి తొక్కుతా.. అసలే నాది జెలు బ్యాగ్రౌండ్ అని మరిచిపోబాకండి" అని దీనంగా హెచ్చరించగానే పరిస్థితి కట్టుదప్పుతా ఉందని గ్రహించిన వాడై యువ రాజు గొంతు విప్పాడు.

"సిద్ధం అని మనం ప్రకటించిన యుద్ధంలో విజయం మనదే.. అయినా తండ్రిగారు ఎందుకో సందేహపడుతున్నారు కాబట్టి మీరంతా మీ విధేయతను ప్రకటించుకోవాలి" అని కత్తులు కరకరలాడే మెత్తని స్వరంతో ఆదేశించాడు. సామంతులు సణుక్కున్నా.. ఒక్కొక్కరుగా నడి సమావేశ మందిరంలోకి వచ్చి వినయ విధేయ వీర భక్త ప్రదర్శనలతో రక్తి కట్టించారు. ఒకరు పులేషం వేసి రంజింపజేయగా, మరొకరు స్వరున చాకు దూసి తన చేతిపై గాటు పెట్టుకుని బొటబొటగారే నెత్తురు వేలికద్దుకుని యువరాజు నుదుటిన బొట్టు దిద్దారు. ఇంకొకరు ఆవేశంగా చొక్కా చింపేసుకుని గుండెలు చూపిస్తూ 'దీన్ని కోసి చూడండి.. మీరే కనిపిస్తారు' అని ఉన్మాదంగా అరిచారు.

ఈ ప్రదర్శనలన్నీ చూశాక రాజుగారూ, యువరాజుగారూ నిమ్మళించారు. అనవసరంగా అనుమానించానే అని చింతపడ్డారు. 'ఇంక పాండి ఇళ్లకి' అని అందరినీ పంపేసి తెల్లారే దాకా హాయిగా ఏసీలేసుకుని నిద్రపోయారు.

మరుసటి రోజు: నిద్రలెయ్యగానే తెలిసిన సమాచారం విని పెద్దరాజుకీ, బుల్లిరాజుకీ చెంబుడు వేడి వేడి నీళ్లు తాగినా ఉదయపు పని సాఫీగా సాగలేదు. రాత్రి వీరంగాలు వేసినవాళ్లలో ఇద్దరు జంప్. ఇంకొకరు రాత్రికి మూర్తం బెట్టుకున్నారు. ఇంకొందరు క్యూలో నిలబడ్డారు అని విని.. 'హతవిధీ.. ఏమిటీ విపరీతం..' అని యువరాజు వైపు పెద్ద రాజు బేలగా చూశాడు. తండ్రిని ఆ స్థితిలో తొలిసారి చూసిన యువరాజుకి అన్నీ జారిపోయాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి






ఛాలెంజ్ ఓటు అంటే....?

ఓటర్ల జాబితాలో పేరున్నా.. ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- తిరుపతి కలెక్టరేట్




టెండర్ ఓటు అంటే ?

ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.

- తిరుపతి కలెక్టరేట్

యో... చూసుకోబళ్లా



ఇటీవలే ఆ నాయకుడు టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకున్నాడు. కొత్త పార్టీలో చేరిన ఉత్సాహంతో ప్రచారంలో గొంతు చించుకునేలా నినాదాలూ చేస్తున్నాడు. 'అమ్మా.. అయ్యా.. మన గుర్తు మీకు తెలుసు కదా.. సైకిల్. సైకిల్ గుర్తుకే మీ ఓటు' అని తరచూ అభ్యర్థిస్తుండడంతో పక్కనున్నవాళ్లు అవాక్కవుతున్నారు. ఆ తర్వాత సర్దుకుని ఫ్యాను గుర్తుకే అని చెబుతున్నాడు. తిరుపతి నగరంలో వీధి వీధినా ఇటువంటి టంగ్‌స్లిప్ సంఘటనలూ రోజూ జరుగుతూనే ఉన్నాయి. పోలింగ్ దగ్గరపడేసరికి అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ నాయకులు పార్టీలు మారేస్తున్నారు. కొత్త కండువాలతో జనం ముందుకు వెళ్లినా పాత వాసనలు వదలడం లేదు. పార్టీల పేర్లూ, గుర్తులూ తప్పు చేప్పేసి నాలుక కొరుక్కుంటున్నారు. 'ఏందియా...యో..నువ్వు, చూసుకోబళ్లా' అని పక్కనున్నవాళ్లు విసుక్కుంటే.. 'మహా మహా మంత్రులే మాట తడబడి సీఎం చంద్రబాబు అని అసెంబ్లీలో ఎన్నిసార్లు అనేసినారు.. యా.. నాదేముండాది' అని సర్దుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆల్ ఇన్ ఆల్.. నేదురుమల్లి

నాలుగు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన అరుదైన ఘనత జిల్లాలోని వాకాడుకు చెందిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. శాసనమండలి, శాసనసభలకు ఒక్కోసారి, రాజ్యసభ, లోక్‌సభలకు మూడేసిసార్లు చొప్పున ఎన్నికయ్యారు. 1972, 2009, 2010లలో రాజ్యసభకు నేదురుమల్లి ప్రాతినిధ్యం వహించారు. ఇక లోక్‌సభకు 1998లో బాపట్ల నుంచి, 1999లో నర్సరావుపేట నుంచి, 2004లో విశాఖపట్టణం నుంచి ఎన్నికయ్యారు. 1978లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన నేదురుమల్లి 1978-1983 మధ్య మర్రి చెన్నారెడ్డి కేబినేట్‌లో మంత్రిగానూ చేశారు. 1989లో వెంకటగిరి నుంచి శాసనసభకు ఎన్నికై 1989-90 మధ్య కాలంలో మంత్రిగా చేశారు. 1990లో ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి పలు ఆరోపణలతో గద్దెదిగారు. ఆరు సార్లు ఎంపీ అయినా ఒక్కసారి కూడా కేంద్ర కేబినేట్‌లో నేదురుమల్లికి మంత్రిగా అవకాశం దక్కలేదు.

-గూడూరు

